వరండాలో కూర్చుని కునికిపాట్లు పడుతున్న ముకుంద రావుకు "సార్ టెలిగ్రాం" అన్న కేక దవడ మీద ఫెడేల్మని కొట్టినట్టు వినిపించడంతో ఉలిక్కిపడి తను కూర్చున్న కుర్చీకి ఎదురుగుండా వున్న వెంకటేశ్వరస్వామి పటానికేసి చూస్తూ లేచి లెంపలు వేసుకుని పోస్ట్‌మేన్ దగ్గరికి వెళ్ళాడు. ముకుందరావు వాలకాన్ని చూసిన పోస్ట్‌మేన్ నోట్లో వున్న కారాకిళ్ళీ తుపుక్కున అవతల వుమ్మేసి "ఏం సార్! అంత కంగారు పడిపోతున్నారు- ఎవరైనా సీరియస్సా?" అని అడిగాడు.

ముకుందరావుకు కోపమొచ్చింది "అసలే తను కంగారుపడి ఛస్తుంటే 'ఎవరైనా సీరియస్సా' అని మరింత భయపెడుతున్నాడు వీడు" అనుకుంటూ "అవును" అన్నాడు.

"ఎవర్సార్- ఫాదరా - మదరా..." అడిగాడు పోస్ట్‌మేన్.

ఎవరైతే నీకేం... అనుకుంటూ "చూస్తేగాని తెలిసిచావదు. ఇద్దరూ ముసలాళ్ళే - ఎవరని చెప్పగలం - నీకు మరీ అంతగా తెలుసుకోవాలనుంటే కాస్సేపాగు. టెలిగ్రాం కాస్త తెరిచి చదివి ఎవరు పోయారో చెప్తాను" అన్నాడు ముకుందరావు.

"ఛ-ఛ- అవేం మాటల్సార్ ... అలాంటి పనులేవీ జరగవు సార్" అంటూ ముకుందరావు చేతికి టెలిగ్రాం ఇవ్వడం ముకుందరావు సంతకం పెట్టి ఆతృతగా టెలిగ్రాం విప్పి చదవడం జరిగాయి. పోస్ట్‌మేన్ ముకుందరావు మొహం కేసి జాగ్రత్తగా చూసి 'ఎవరూ పోయుండరు' అని నిర్ణయించుకుని "ఏం సార్... ఎవ్వరూ..." అంటూండగా-

"పోలేదయ్యా..." అంటూ జానకి అని పెద్దకేక వేశాడు. కొంప తీసి అరిటతొక్క మీద కాలువేసి జారి పడిపోయాడేమో ననుకుంటూ కంగారుగా 'ఏమండీ' అంటూ వచ్చిన జానకి ముకుందరావు నిటారుగా నిలబడి వుండడం చూసి "ఎందుకలా చెవి కోసిన మేకలా అరిచారు" అంది కోపంగా.

"ఈ టెలిగ్రాం చూడు..." అంటూ టెలిగ్రాం భార్యకిచ్చాడు.

అలా చూసిన జానకి.. "చూశారా... మా అన్నయ్య, వదిన, వాళ్ళ పిల్లలిద్దరూ పండక్కి వస్తున్నారు" ఎంతో మురిసిపోతూ... గర్వంగా చెప్తున్న జానకి ముకుందరావు మొహానికేసి చూసి "ఎందుకలా మూతి ముడుచుకున్నారు... తెలుసులేండి- మా వాళ్ళంటే మీ కేనాడు గిట్టింది కనుక. ఎంతసేపు మీ వాళ్ళు... మీ మనుషులైనే..." మొదలెట్టింది. జానకి నోరు తెరిస్తే ఆపడం అంత సులువు కాదు. అందుకని ముకుందరావు మరీ భయపడిపోడు-అప్పుడప్పుడూ తను జానకికి భర్త అని - అంతకన్నా ముఖ్యంగా తనొక మగాడని రుజువు చెయ్యాలనుకుని ప్రయత్నిస్తాడు.

"ఎవరైతేనేం... అని ఇంతకూ ఎప్పుడొస్తారో చెప్పారా...' అడిగాడు.

"ఎల్లుండి పొద్దున్న మెయిలుకు" కసిమని చెప్పింది జానకి.

"బతికించారు. ఆదివారం... లేకపోతే ఒక రోజు సెలవు దండగయ్యేది" అనుకుంటూ లోపలికి నడవబోతున్న ముకుందరావు మరోసారి "సార్ టెలిగ్రాం" అన్న కేక వినబడగానే కంగారుపడిపోయాడు-కొంపతీసి ఇందాక తప్పిపోయిన మ్యాస్ కాని వచ్చిందా అని భయపడిపోయాడు.

ఇంతలో జానకి 'ఇటివ్వు' అంటూ పోస్ట్‌మెన్ చేతిలోంచి టెలిగ్రాం తీసుకుని, సంతకం పెట్టి టెలిగ్రాం విప్పబోతుంటే ముకుందరావు వెంకటేశ్వరస్వామి పటానికి దణ్ణం పెట్టుకుంటున్నాడు- మరోసారి.


భర్త భయానికి నవ్వుకుంటూ "ఇటు చూడండి..." అని "వయసుమళ్ళిన వాళ్ళున్నంత మాత్రాన టెలిగ్రాం వచ్చినప్పుడల్లా అల్లా కంగారుపడకండి- ఎప్పుడైనా జరిగేది జరగక తప్పదు కదా" అంటూ టెలిగ్రాం విప్పిన జానకి నుదుటికి చెమట పట్టింది - ఈ మాటు మరింత భయపడ్తూ

"ఎవరు"అడిగాడు ముకుందరావు

"మీ అక్క బావ పండక్కి వస్తున్నార్ట..." నీరసంగా అంటూంది జానకి.

"అమ్మయ్య... బతికించావ్" అంటూ మరెందుకంత నీరసంగా మొహం పెట్టావ్-మా వాళ్ళు వస్తున్నారనేగా-నీకెంతసేపూ మీ అన్నా... వదినలే గాని" అంటూ వెక్కిరించాడు ముకుందరావు.

జానకి జవాబు చెప్పలేకపోయింది- పండగ సంబరం కాస్త నటాపంచలైపోయింది- తను - తన సంసారం నలుగురు- దానికి





తోడు తన వాళ్ళు నలుగురు, తన భర్తవైపు వాళ్ళు మరో నలుగురు పండక్కి తయారౌతున్నారు. అందరికీ కలిపి వంటా వార్పూ చెయ్యడంతోనే పండగ పండిపోతుంది-"పోనీ ఈ వచ్చే వాళ్ళైనా వంతులు వేసుకుని రాకూడదూ-ఒక్కసారే వూడిపడాలా" అనుకుంది జానకి.

"ఏ ట్రైయిన్లో వస్తున్నారో" అడిగాడు ముకుందరావు.

'సర్కార్' అంది జానకి.

"వచ్చామురా బాబూ- మీ అన్నయ్యవాళ్ళు పొద్దున్న అయిదు గంటలకు మెయిల్లో వస్తారు-మా అక్కయ్యవాళ్ళు ఏడు గంటలకు సర్కార్లో వస్తారు. మొదట వచ్చిన వాళ్ళను ఇంట్లో దింపి, మళ్ళీ రెండో సారి వచ్చేవాళ్ళను తీసుకు రావడానికి వెళ్ళాలి- అనుకుంటూ, "పోనీ మెయిల్లో వచ్చినవాళ్ళు సర్కార్లో వచ్చేవాళ్ళకోసం వెయిట్ చేస్తే ఏకంగా ఒకేసారి టాక్సీ చేసుకురావచ్చు. ఖర్చు కలిసి వస్తుంది- వస్తుంది-కాని వాళ్ళొప్పుకోవాలి కదా" అనుకుంటూ ఆ ముక్కే జానకితో





# పండగెళ్ళి పోయిందా

-ఉపద్రష్ట సాయి

చెప్పాడు.

"మా అన్నయ్యవాళ్ళను ఇంట్లో దిగబెట్టి తరువాత మీ అక్కయ్యవాళ్ళను తీసుకురండి- ఒకే టాక్సీ పొద్దుటే నుంచి ఏర్పాటు చేసుకుంటే సరి-అంది జానకి."

"బోల్డవుతుంది డబ్బు" అన్నాడు ముకుందం. మరైతే ఓ పని చెయ్యండి. ఎలాగూ మా అన్నయ్యవాళ్ళు మెయిల్లో వస్తున్నారు. అప్పుడు బస్సులుండవు కనుక. ఆటో ఏర్పాటు చేసుకోండి- మీ అక్కయ్య వాళ్ళు వచ్చేసరికి బస్సులుంటాయి కనుక బస్సులో తీసుకురండి-ఖర్చు తగ్గుతుంది" లౌక్యంగా చెప్పింది జానకి.

బస్సులో వచ్చినా, టాక్సీయో, ఆటో ఎక్కినా, నడిచి వచ్చినా కష్టం తనదే... అందుకే జానకి అలా చెప్పిందనుకుంటూ...

"మా వాళ్ళనూ... ఆటోలో తీసుకువస్తాన్లే..."

"అది - మీ ఇష్టం- అయినా పండగ ఎందుకు వచ్చిందా అనుంది- ఇంకే వెళ్ళిగాం వస్తుందో" అంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది జానకి.

* * *

హౌరా మెయిలు అలిసిపోయి వచ్చి ఎగ ఊపిరి తీసుకుంటూ స్టేషన్లో ఆగింది- అక్కడికి వచ్చిన వాళ్లందరూ ఆతృతగా కంపార్ట్‌మెంట్స్‌లోకి చూస్తూ తమ వాళ్ళను వెతికేస్తున్నారు. పొద్దున్నే ఐదు గంటలు కూడా కాకపోవడంతో ఆ చీకట్లో ఎవరి మొహాలూ సరిగ్గా కనబడడంలేదు. రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన వాళ్ళలో చాలా మంది రైల్లో వస్తున్న వాళ్ళని తిట్టుకుంటున్నారు. అంత వేకువజామునే నిద్ర చెడగొట్టడానికే వస్తున్నారని పైకి చెప్పలేక, లేని సంతోషం మొహంలో ప్రకటిస్తూ విసుగ్గా వెతుకుతున్నారు.

ఇంతలో "మామయ్యా... మామయ్యా" అంటూ కేక వినబడడంతో వెనక్కు తిరిగిన ముకుందరావుకు రమణ, వాడి చెల్లెలు వనజాక్షి కనిపించారు. వాళ్ళ వయస్సు పది, ఎనిమిది సంవత్సరాలు. "హి హి హి... బావగారూ కులాసానా" అంటూ రాజారావు కంఠం వినిపించడంతో ముకుందరావు ఆ జనంలో అటు, ఇటూ వెతికి చివరికి రాజారావును, రాజ్యలక్ష్మిని కనిపెట్టాడు- 'అమ్మలు రాలేదా' అడిగింది రాజ్యలక్ష్మి. ఆ ప్రశ్నకు ముకుందరావుకు చిరాకు, కోపం వచ్చింది.''ఈ చలిలో, పొద్దున్నే వీళ్ళని ఇంటికి తీసుకు వెళ్ళడానికి దంపతి సమేతంగా రావాలా" అనుకుంటూ "రాలేదు... మీ కోసం టిఫిన్ వగైరాలు రెడీ చెయ్యాలి కదా" అన్నాడు ముకుందరావు.

"పోర్టర్‌ను పిలుస్తావా" అడిగాడు రాజారావు.

"పోర్టరెందుకండీ- తలోటీ పట్టుకుంటే ఆటోదాకా నడిచెళ్ళిపోగలం" అంటూ అక్కడున్న పెట్టెల్లో ఒకటి పైకెత్తబోయి, బరువుకు తూలి పడిపోబోయి ప్రక్కనే వస్తున్న ఒక అమ్మాయి మీద పడ్డాడు. ఆ అమ్మాయి కాస్త కోపంగా చూసి గుడ్లురజేసి... 'ఇడియట్' అంటూ పోయింది.

ఛ-ఛ ఇదేం పెట్టో... శవపేటికలా వుంది. అనుకుంటూ "ఇంత బరువుందేమిటి బావగారూ" అనడిగాడు.

"అదా... అవున్లే... మీ ఆవిడ క్రితం సారి వచ్చినప్పుడు కలకత్తాలో రోళ్ళు ఎంచక్కా బాగుంటాయి ఈసారి నాకోటి తెద్దూ" అంది- అందుకే ఓ మీడియం సైజు రోలు ఈ పెట్టెలో పెట్టి తెచ్చాను. లేకపోతే లగేజీ, వగైరాలు అడుగుతారుగా" అన్నాడు రాజారావు.

'ఓరి... వీళ్ళ తెలివి మండినేనీ... రోలును పెట్లో పెట్టి నా చేత మోయిస్తారా' అనుకుని పోర్టర్‌ని పిలవక తప్పదు అనుకున్నాడు.

ఎలాగైతేనేం రైలు దగ్గిర నుంచి, ఆటో దాకా పెట్టెలు సంచులు తేవడానికి పన్నెండు రూపాయలు కూలి అడిగాడు పోర్టరు- "మొదటి దండగ" అనుకుంటూ, వంద రూపాయల నోటు తీసి "బావగారూ నా దగ్గర వంద కాయితం వుంది- మీ దగ్గర చిల్లరుందా' అడిగాడు ముకుందరావు.

"ఈ పోర్టరు కివ్వడానికేనా" అన్నాడు రాజారావు.

"అవునవును. తొందర్లో చిల్లర తేలేదు..." అన్నాడు ముకుందరావు.


"ఫరవాలేదులెండి... ఆ వందిటివ్వండి" అని తీసుకుని పోర్టరుకు పన్నెండు రూపాయలిచ్చి మిగిలిన ఎనభై ఎనిమిది రూపాయిలు ముకుందరావుకిస్తూ...''బ్యాంకులో పని చేస్తున్నానుగా... ఇలాంటి పరిస్థితులు ఏర్పడతాయని ఎప్పుడూ చిల్లర రెడీగా వుంచుకుంటాను" అన్నాడు రాజారావు.

"ఉద్ధరించారు..." అనుకున్నాడు ముకుందరావు

తను ఎత్తు వేస్తే రాజారావు పైఎత్తు వేశాడనుకున్నాడు.

ఆటోలో ఆరు పెట్టెలు, మూడు సంచీలు, నలుగురు చుట్టాలు తనూ కూర్చోవడంతో బండి బాలింతరాల్లా బయలుదేరింది. మధ్యలో పెద్ద బ్రిడ్జి. బండి పాతది కావడం మూలాన ఏ నిమిషం వెనక్కు నడుస్తుందోనని భయపడి ఛస్తున్నాడు ముకుందరావు.

"మద్రాసు సరదాగా వుందండీ..." అన్నాడు రాజారావు. ముకుందరావుకు కోపం ముంచుకు వచ్చి, బ్రిడ్జి మీద బండి బాధ పడుతూంది..బండ్లో చింతపండు బస్తాల్లా



కూర్చుని నలిగిపోతుంటే మద్రాసు సరదాగావుందట అనుకుంటూ "అవునండి" అన్నాడు ముకుందరావు. మనసులో మాత్రం బండి ఇంటిదాకా నడుస్తుందా అనుకున్నాడు.

ఎలాగైతేనేం ఆటో ఇంటికి వచ్చి చేరింది.

వాకిట్లో నుంచున్న జానకి ఆప్యాయంగా అన్నను, వదినను, పిల్లలను "రండి... రండి" అని ఆహ్వానించింది. వాళ్ళతో బాటూ లోపలికి రాబోతున్న ముకుందరావుతో

"ఆటోను పంపించండి" అంటూ మట్టాలను లోపలికి తీసుకు వెళ్ళిపోయింది జానకి.

అప్పటికి మరో అరగంటే వ్యవధి వుంది. సర్కార్ రావడానికి అందుకోసం మళ్ళీ బస్సులో వెళ్ళడం కుదరదనుకుంటూ, వచ్చిన ఆటోలోనే మరోసారి స్టేషన్‌కు బయలుదేరాడు ముకుందరావు. తను వెళ్ళేసరికి ట్రైను ప్లాట్ ఫారమ్ మీదికి వచ్చేసింది.

"మామయ్యా... మామయ్యా" అనే కేక మరోసారి వినిపించడంతో కళ్ళు తుడుచుకుని చూసిన ముకుందరావుకు ఎదురుగుండా రమణ - రాధ కనిపించారు. మళ్ళీ రమణ అని ఎందుకన్నానంటే ఆంధ్రదేశంలో రమణలు, చిట్టిబాబులు ఎందరో వున్నారు కనుక "బావగారూ... అంటూ భుజం మీద చేయి వేసి పలకరించాడు విశ్వనాథం - అతని ప్రక్కనే తన అక్క వరలక్ష్మి "ఏరా తమ్ముడూ బాగున్నావా" అంది.

"హి...హి...హి... బాగున్నానే ... రండి - అంటూ వాళ్ళ చేతులకేసి చూసి ఆశ్చర్యపోయాడు. "సామాన్లేవీ" అడిగాడు.

"పోర్టర్‌తో బండి కెక్కించేసాం. టాక్సీ పిలువెళ్దాం" అన్నాడు విశ్వనాథం "టాక్సీ ఎందుకు లెండీ, బస్సులో వెళ్ళిపోవచ్చు..." అన్నాడు ముకుందరావు.

"అబ్బే... అంతఃగేజీతో బస్సెం సరిపోతుందీ ... టాక్సీ పిలవరా" అంది వరలక్ష్మి.

మరో గత్యంతరం లేక టాక్సీ ఏర్పాటు చేశాడు.

టాక్సీలో సామాన్లు సర్దేసరికి వచ్చిన వాళ్ళు కూర్చోడానికి కూడా స్థలం లేకపోయింది. ఒకళ్ళ మీద మరొకళ్ళు కూర్చుని ఊపిరందక అగచాట్లు పడుతుంటే బండి కదిలింది.

పొద్దున్న పోర్టర్‌కు పన్నెండు, ఆటోకు ఇరవై, ఇప్పుడు పోర్టర్‌కు ఇరవై, టాక్సీకి యాభై కలిపి వంద రూపాయిలు దాటాయి. "మట్టాలు గుమ్మంలో కాలు పెట్టేలోగా వంద రూపాయిలు ఖర్చయిపోయాయి. పండగదాకా ఇంకెంత ఖర్చవుతుందో" అనుకుంటూ దిగాలుగా కూర్చున్న ముకుందరావును కుదుపుతూ - "ఇల్లొచ్చింది దిగండి" అంటున్నాడు విశ్వనాథం. 'నా ఇల్లు నాకు తెలీదూ' అనుకుంటూ దిగాడు. వాకిట్లో జానకి కనిపించలేదు. 'రండి' అని తనే ఆహ్వానపత్రం చదివి లోపలికి తీసుకు వెళ్ళాడు రెండో బ్యాచ్ మట్టాల్ని.

* * *

"పండుగ మద్రాసులో బాగుంటుంది" అన్నాడు రాజారావు.

"కాదు మరీ..." వంత పాడాడు విశ్వనాథం.

"సంక్రాంతి పండుగ గ్రామాల్లో గానీ పట్నాల్లో ఏం బాగుంటుంది" అన్నాడు ముకుందరావు.

ఇంతలో ... జనాకి ప్లేట్లో ఉప్మా, చట్నీ తీసుకు వచ్చి వాళ్ళన్నయ్యకిచ్చింది. విశ్వనాథం ముకుందరావు కేసి కొరకొర చూశాడు. ముకుందరావు జానకి కేసి కోపంగా చూశాడు. జానకి మూతి విరుచుకుని వంటింట్లోకెళ్ళి రెండు ప్లేట్లు తెచ్చి విశ్వనాథం ముందు, ముకుందరావు ముందు పెట్టింది. ముకుందరావు ప్లేట్లో స్పూను లేదు. రాజారావు, విశ్వనాథం ప్లేట్లలో చెంచాలున్నాయి. ఈ మాటు ముకుందరావుకు మరింత కోపం వచ్చి జానకిని గావుకేక వేసి పిల్చి తనకు స్పూనెందుకివ్వలేదని నిలదీశాడు.

"మీకు చేత్తో అలవాటేగా" అంది జానకి చిలిపిగా ముకుందం కళ్ళలోకి చూస్తూ.

"అయినా ... మిగతా వాళ్ళెదుట చేత్తో" అన్నాడు.

"స్పూన్లు అంట్లలో వున్నాయి. కాస్త సర్దుకోరూ" అంది మరో గత్యంతరం లేక వూరుకున్నాడు ముకుందరావు.

"మద్రాసులో జీడిపప్పు దొరకదటండీ" అడిగాడు విశ్వనాథం.

ఎవరు చెప్పింది - నా ఉప్మా నిండా జీళ్ళే - చూపిస్తూ అన్నాడు రాజా రావు. కళ్ళజోడు సర్దుకుని రాజా రావు ప్లేటు నిండా జీళ్ళుండడాన్ని చూసిన విశ్వనాథం "మరి నాకు ఒకటి కూడా రాలేదే?" అని సూటిగా ప్రశ్నించాడు.

"అది మీ లక్కు" అందామని తమాయించుకుని ఆగాడు.

మరోసారి జానకిని గావుకేక వేసి పిల్చాడు.

"ఏమైంది" అంటూ వచ్చిన జానకితో జీళ్ళ గురించి అడిగాడు.

"అయ్యో రామ! జీళ్ళు తింటే కీళ్ళు వాచిపోతాయి. మా తాతయ్యగారు తెలీకుండా ఇంటికి వచ్చిన మట్టాలకు జీళ్ళెక్కువ పెట్టడంతో వాళ్ళందరికీ కీళ్ళవాతం వచ్చి ..." అంటూండగా.

"తల్లీ... వద్దు... జీళ్ళు వద్దు. ఉప్మా" అని ప్రాధేయపడ్డాడు విశ్వనాథం.

"కావాలంటే నావి తీసుకోండి" అన్నాడు రాజారావు.




"చావండి" అనుకుంటూ వంట గదిలోకి వెళ్తున్న భార్య దగ్గరికి వెళ్ళిన ముకుందరావు ... తక్కున ఆగాడు.

క్రేవ్ వక్కపొడి - నెస్కఫే బుడ్డీ - హార్లిక్సు... బోర్నవిటా డబ్బా ... వగైరా ... వగైరాలు కావాలని ఒక పెద్ద లిస్టిచ్చింది జానకి. "చూడు! ఇవన్నీ ఎందుకే" అన్న ముకుందరావుతో "మా అన్నయ్యకు హార్లిక్స్ - మా వదినకు నెస్కఫే, వాళ్ళ పిల్లలకు బోర్నవిటా" అంటూ జానకి చెప్తుంటే ముకుందరావుకు మతి పోయింది.

మట్టాలొచ్చి మూడు రోజులైంది. అంతే. ఐదారు వందల రూపాయిలు ఖర్చయిపోయాయి. అప్పటికీ జాగ్రత్తగా ఖర్చు పెడుతున్నాడు తను. ఈ వేగంతో ఖర్చుపెడితే పండగ లోగా వెయ్యి రూపాయిలు ఖర్చయి పోతుంది. కంగారు పడిపోతున్నాడు ముకుందరావు. ఎప్పటికప్పుడు ఖర్చు కబుర్లు దాటించేస్తున్నాడు. రాజారావు మాత్రం మరీ ఖర్చు కబుర్లే ఆడుతున్నాడు.

పండక్కి 'ఫ్రిజ్' కొనుక్కుందామని పైస పైస పొదుపు చేసి రెండు వేలు దాచుకున్నాడు ముకుందరావు. వాయిదాల పద్ధతిలో ఎంచక్కా ఫ్రిజ్ కొనాలని రెండు సంవత్సరాల బట్టి కలలు కంటూ చివరికి డబ్బులు పోగుచేసుకుంటే ఈ మట్టాలు ఊడిపడడంతో 'అయి పోయింది ఫ్రిజ్ కొనడం' అనుకున్న ముకుందరావుకు పొదుపు చేసుకున్న డబ్బు కూడా కర్పూరంలా కరుగుతుంటే కోపం వచ్చింది. "తన అక్క బావలకైనా బుద్ధుండాలి" అనుకున్నాడు ముకుందరావు.

ఎప్పటికప్పుడు ఇది కావాలి, అది కావాలి అంటూ పురమాయింపులు. "మట్టాలింటికి వచ్చినపుడు తమ అవసరాలను, అలవాట్లను అదుపులో పెట్టుకోవాలనే సంస్కారం వుండొద్దూ" అనుకున్నాడు ముకుందరావు. వాళ్ళని అని తప్పు లేదు. జానకి మాత్రం ఏం? వాళ్ళేం

మిగతా 65వ పేజీలో

( 24వ పేజీ తరువాయి )

కావాలన్నా వెంటనే "ఏమండి... ఏమండీ" అని పిలిచి వాళ్ళ ఎదురుగుండానే అడిగితే, వద్దని ఏం చెప్పగలడు తను.

మరో రెండ్రోజుల్లో పండగుందనగా

"హిహిహి! బావగారు మద్రాసులో కంచిపట్టు చీరెలు చవగ్గా దొరుకుతాయిటగా!" అన్నాడు రాజారావు.

'అమ్మో! కొంప ముంచేస్తున్నాడు. మెల్లగా పండగ బట్టల దాకా వచ్చాడన్న మాట!' అనుకుంటూ-

"అబ్బే! మద్రాసులో కంచి పట్టు చీరెలు సరసం కాదండీ- బయట ఊళ్ళో నుంచి వచ్చినవాళ్ళు అలా అనుకుంటారు గానీ అందతా అబద్ధం. పట్టుచీరెలు నాసి రకంవి చవగ్గా అమ్ముతారు. అవి పండగ రోజుకు మాత్రమే బాగుంటాయి. రెండోసారి కట్టుకోవడానికి పనికి రావండీ. త్రో అవే సరుకు" అన్నాడు ముకుందరావు.

"మరి మా కాశీపతి రెండు నెలల క్రితం మద్రాసు వచ్చినప్పుడు కంచిపట్టు చీరెలు కొన్నాడు. మీరన్నట్టు అలా జగలేదే- బాగానే వున్నాయి" అన్నాడు రాజారావు.

"అదాయన లక్కు" అన్నాడు ముకుందరావు.

ఇంతలో విశ్వనాథం తమలపాకులకు సున్నం రాస్తూ "బావగారూ! మహాబలిపురం ఎంత దూరం వుంటుందండీ... ఎప్పుడో మీ పెళ్ళప్పుడు వెళ్ళాను... పిల్లలు మహాబలిపురం చూడాలని..." అంటున్నాడు.

'పెట్టేశాడు! నెత్తి మీద చెయి పెట్టేశాడు... మహాబలిపురం ఎంత దూరమండీ అని అడిగినప్పుడే తెలుసు..' అనుకుంటూ

"నలభై కిలోమీటర్ల దూరమండీ.. అయినా ఇప్పుడక్కడ చూడవలసినదేమీ లేదు... పల్లవులు కట్టిన గుళ్ళూ గోపురాలు బంగాళా ఖాతంలో కొట్టుకుపోయాయి. తిరుగుడు మాత్రమే: మిగుల్తుంది..." అంటున్న ముకుందరావుతో-

"పక్షితీర్థం చూసి తీరవలసిన స్థలమట కదా... అక్కడ పంక్చువల్‌గా పక్షులు వస్తాయటగా" అన్నాడు విశ్వనాథం.

"అదంతా ఆ కాలంలో... ఇపుడు పక్షులు ముసలివైపోయాయి. సమంగా రావడం లేదట. అంతే కాదు... పక్షుల కోసం రెండు మూడు వేల మెట్లు ఎక్కి కొండ పైకి వెళ్ళాలి. మా స్నేహితుడొ కాయన కొండ ఎక్కలేక గుండె పోటొచ్చి..." అంటూండగా-

"ఆ... ఆయన హార్ట్ పేషెంటు గానీ మా అన్నయ్య, వదినలకు హార్ట్ ట్రబుల్స్ లేవు. వాళ్ళూ మహాబలిపురం కూడా చూడాలనుకున్నారు..." అంటూ వచ్చింది జానకి.

'ఛ! ఛ! నాకు ఇంట్లోనే శత్రువులు తయారయ్యారు. ఎంతసేపు డబ్బు క్షవరమయ్యే ప్రోగ్రామ్స్ చెప్తున్నారు' అనుకుంటూ "మహాబలిపురంలో చూడడానికేమీ లేదు జానకి. దాని కన్నా మెరీనా బీచ్‌కి వెళ్ళవచ్చు" అన్నాడు ముకుందరావు.

"అదెలాగు చూస్తామనుకోండి. మహాబలిపురం చూశొచ్చాక మెరీనా, విజిపి బీచ్, వండర్‌లాండ్, జంతు ప్రదర్శన శాల, మొసళ్ళ పార్కు, పాముల పార్కు..." చెబుతూనే వున్నాడు రాజారావు. అతని చేతిలో ఒక పెద్ద లిస్ట్ వుంది.

ముకుందరావు తల బొంగరంలా తిరుగుతూంది. 'పెద్ద పథకం మీదే వచ్చాడన్న మాట. ఏదో పండక్కి వచ్చారనుకుంటే తమిళనాడు మొత్తం తిరగడానికి ప్లాన్ వేసే శారన్నమాట.' అనుకుంటున్న ముకుందరావుతో....

"ఎంచక్కా ఓ కారు అద్దెకు తీసుకుంటే అటు మహాబలిపురం, కంచి చూసుకోవచ్చు. మరో రోజు బీచ్‌లు, 'జూ'లు, పార్కులు తిరగవచ్చు. ఎప్పుడో గానీ మద్రాసు వచ్చే ఛాన్సు దొరకదు. తీరా ఇంత దూరం వచ్చాక ఒక్కసారే అన్ని స్థలాలూ చూస్తే సరి. లేకపోతే మళ్ళీ ఎప్పుడు కుదురుతుందో ఏమో" అన్నాడు విశ్వనాథం. అనడంతో బాటు "ఏమంటారు, రాజారావుగారూ" అని బోడి సలహా కూడా అడిగాడు.

"హిహిహి! మీరన్నదాంట్లో లాజిక్కుంది. పని గట్టుకుని ఇంత దూరమొచ్చి వండర్ లాండ్‌లు, మహాబలిపురాలెక్కడ చూడగలమండీ. ఎలాగూ మద్రాస్ వచ్చాం కనుక సరిపోయింది- నాలుగు రోజులాలస్యమైనా ఫరవాలేదు" అంటున్న రాజారావుతో

"మీరు డ్యూటీలో ఎపుడు జాయినవ్వాలి" అని 'ఎప్పుడు మీరు వెళ్ళిపోతారు' అన్న అర్థం గోచరించేలా అడిగాడు ముకుందరావు.

"న్యాయంగా అయితే ఎల్లుండి జాయినవ్వాలి. మరో పది రోజులు లీవు పొడిగిస్తూ పొద్దున్నే టెలిగ్రామిచ్చేశాను" అంటున్న రాజారావుతో "అమ్మయ్య! మీరు కూడా టెలిగ్రాం కొట్టేశారా- నేను కూడా నిన్న సాయంత్రమే కొట్టాను. పది రోజులు పొడిగించే శాను. మా చెల్లెలు పాపం 'వుండిపోకూడదూ...' అంది" అన్నాడు విశ్వనాథం.

'అమ్మ... వీళ్ళంతా మరో పది రోజులుంటారా' అనుకున్న ముకుందరావు కళ్ళు బైర్లు కమ్మాయి. తల తిరుగుతూంది. మిగుల్చుకున్న డబ్బు ఖర్చవడం కాదు, వచ్చే నెల జీతం కూడా క్షవరమయిపోతుంది- ఇప్పుడెలా...' అనుకుంటూ కూర్చుండిపోయాడు.

"బావగారు 'డల్' అయిపోయారు. కాస్త కాఫీ తెద్దూ" అని కేక వేశాడు రాజారావు. 'వీళ్ళ పురమాయింపు మండ... నా యింట్లో నాకే' అనుకున్నాడు ముకుందరావు.

"వస్తున్నా... నెస్ కేఫ్ అయిపోయింది- ఆయనేరీ..." అంటున్న జానకి మాటలు విన్న ముకుందరావు "వస్తున్నా" అంటూ బయటికి జారిపోయాడు.

*   *   *


ఏడుపు మొహంతో కనిపిస్తున్న ముకుందరావును ఓదారుస్తున్నారు గోపాలం, భూతలింగం. "నీ కెంత కావాలిరా" అడిగాడు గోపాలం. "డబ్బు వద్దురా..." అన్నాడు ముకుందరావు.

"మరి" అడిగారు వాళ్ళు.

"వాళ్ళెళ్ళిపోవాలిరా. రోజూ వంద రూపాయిలు ఖర్చవుతుంది. ఇప్పటికి రెండుసార్లు లీవు పొడిగించారు. పోనీ మా అక్క వెళ్తుందంటే అదీ అంతే. మా బావ కూడా 'ఎంచక్కా ఎలాగూ వచ్చాం... వుందాం, వుందాం' అంటున్నాడు. మా వాళ్ళిలా అంటే మా ఆవిడ అన్న, వదినలు మరీనూ. వాళ్ళెప్పుడు వెళ్ళిపోతారో వాళ్ళకే తెలియనట్లుంది. నాకు డబ్బు వద్దురా" అన్నాడు ముకుందరావు దీనంగా. ఐదు నిముషాలు ఆలోచించి "పోనీ ఓ పని చెయ్యి. రెండ్రోజులు షేవ్ చేసుకోకుండా మూడోరోజు మూర్ఛ వచ్చినట్టు పడిపోరా. నిన్ను చవగ్గా వున్న హాస్పిటల్లో చేర్పిస్తాం. దెబ్బతో నీ బరువు మొయ్యాలని వాళ్ళు జారుకుంటారు" అన్నాడు భూతలింగం.

"అవ్రా... సూపరైడియా.. మన భూతానికి వచ్చే ఆలోచనలన్నీ గొప్పవిరా..." అంటున్న గోపాలంతో

"ఏడిశారు- నేను హాస్పిటల్లో చేరితే అటు హాస్పిటల్ ఖర్చులు...,



ఇటు చుట్టాలు- ఇద్దర్నీ భరించాలిగా'' అన్నాడు ముకుందరావు.

''కాదురా! నువ్వు ఆస్పత్రిలో చేరితే చాకిరీకి భయపడి వాళ్ళెళ్ళిపోతారుగా' అన్నాడు గోపాలం.

''సమస్య వెళ్ళిపోతే కాదురా! వెళ్ళకుండా 'అయ్యో! పాపం!' అంటూ వుండిపోతే వచ్చేదే'' అన్నాడు ముకుందరావు.

''పోనీ ఓ పన్చెయ్... వాళ్ళ రైలు టిక్కెట్లు కొనడానికి 'డేటు' అడుగు. అప్పుడు తెలుస్తుంది వాళ్ళెప్పుడు వెళ్దామనుకున్నారో'' అన్నాడు భూతలింగం.

''వాళ్ళు రైల్వేలో పని చేస్తున్నార్రా- పాసులున్నాయి. టిక్కెట్లు వాళ్ళకు సమస్య కాదు'' అన్నాడు ముకుందరావు.

మరో పది నిముషాల ఆలోచన తర్వాత ''ముకుందం! ఇప్పుడు బాధపడి లాభం లేదురా. ఎంతో కొంత ఖర్చు భరించక తప్పదు. అప్పుగా ఎంత కావాలన్నా ఇస్తాం. వాయిదాల పద్ధతిలో రిటర్న్ చేద్దువు గానీ'' అన్నారు గోపాలం, భూతలింగం.

''అంతే... మరో దారి లేదు. ప్రస్తుతానికి ఓ వెయ్యి రూపాయిలివ్వండ్రా... అంతా నా కర్మ. పైసా పైసా కలిపి రెండు వేలు బ్యాంకులో దాచుకున్న నేను ఆ రెండు వేలు ఖర్చై, వచ్చే నెల జీతం కూడా ఖర్చు పెట్టేసి, మీ దగ్గర వెయ్యి రూపాయిలు అప్పు తీసుకునే స్థితికి వచ్చాన్రా... అంతా నా ఖర్మ...'' అన్నాడు ముకుందరావు.

''అలా బాధపడకురా. మేమున్నాం. నీ కెంత కావాలన్నా అప్పిస్తాం. వడ్డీ కూడా తక్కువకే''

ముకుందరావు మూర్ఛపడిపోతూ ''వడ్డీకా'' అని అడిగాడు.

''మరెలారా! మేము బయట వడ్డీకి తీసుకుని నీకివ్వాలి... మన స్నేహం కోసం ఈ సహాయం చేస్తున్నాం...'' అన్నాడు భూతలింగం.

''అయితే.. ఐదొందలివ్వండ్రా చాలు'' అన్నాడు ముకుందరావు.

మరో వారం రోజులు గడిచాయి. చుట్టాలు మద్రాసు మొత్తం తిరిగి చూసేశారు. కనబడ్డ వస్తువులన్నీ కొనుక్కున్నారు. బర్మా బజారు, పాండీ బజార్లు సర్వే చేశారు. కంచి పట్టు చీరెలు రాజారావు భార్య, విశ్వనాథం భార్య కొనుక్కున్నారు. పిల్లలకు రెడిమేడ్ బట్టలు, బొమ్మలు కొన్నారు. మద్రాసు విసిగిపోయింది వాళ్ళకు.

''రేపు వెళ్ళిపోతున్నాం బావగారూ'' అన్నారు రాజారావు, విశ్వనాథం.

''వెళ్తారు గానీ...ఏం తొందర...'' అనబోయిన ముకుందరావు చటుక్కున ఆగి తొందర పడకూడదు అనుకున్నాడు. కానీ అతను అందామనుకున్న ఆ ముక్కలనే జానకి అనడంతో, భార్యవేపు కొరకొర చూశాడు ముకుందరావు.

''లేదమ్మా! ఇప్పటికే ఆలస్యమైపోయింది. ఎందుకో మీ ఆదరణ, ప్రేమ చూస్తుంటే కొంత కాలం వుండిపోవాలనిపించి బస పొడిగించాము. తృప్తిగా మీతో గడిపాము... రేపు వెళ్తున్నాం'' అన్నారు వాళ్ళు.

మర్నాడు స్టేషన్లో వాళ్ళను దిగబెట్టడానికి భార్యా సమేతంగా వెళ్ళాడు ముకుందరావు.

స్టేషన్లో రద్దీ ఎక్కువగా వుంది. రాజారావు, విశ్వనాథంల కుటుంబాలు హౌరా మెయిల్లో వెళ్తున్నారు. సామాన్లు బండిలో వెళ్తుంటే రాజా రావు, విశ్వనాథంలు వెనుక నడుస్తు న్నారు.

వాళ్ళకు కొంచెం దూరంలో వెనకాతలే నడుస్తున్నాడు ముకుందరావు భార్యతో. పిల్లలు ముందు వెళ్తున్నారు.

రాజారావు విశ్వనాథంతో ''భలే కో ఆపరేట్ చేశారండీ... మనం ఆడిన నాటకం ముకుందరావుకు తెలియలేదు'' అన్నాడు.


''మరేమిటండీ... పెళ్ళై పదిహేను సంవత్సరాలైంది ఆయనకు... ప్రతి ఏడూ వేసవి సెలవులకు మా వూరూ, క్రిస్మస్ సెలవులకు మీ వూరూ వచ్చి 'తిష్ట' వేస్తాడు భార్యా పిల్లలతో. మనకూ సంసారాలున్నాయన్న విషయం అతనికి తెలియదూ... అందుకే ఆ కష్టమేమిటో వాళ్ళకి తెలియాలనే నేను కూడా మీతో చెయ్యి కలిపాను. ఎంత తోబుట్టువులైనా, కాపురాలేర్పడిన తర్వాత, కుటుంబాలు పెద్దవవుతూంటే ఆర్థిక పరిస్థితులు అర్థం చేసుకోవాలి కదండీ'' అన్నాడు విశ్వనాథం.

ఆ మాటలు విన్న జానకీ ముకుందరావులు ఒకరి మొహాలొకళ్ళు చూసుకున్నారు. వాళ్ళ దవడల మీద ఫెడీల్మని తగిలాయి ఆ మాటలు. అప్పుడు గానీ ముకుందరావుకు అర్థం కాలేదు. తమ ప్రతి ఏడూ వాళ్ళనెంత కష్టపెట్టాడో... సామాన్లు బండిలోకి ఎక్కాయి. చుట్టాలు కూడా బండెక్కారు. బండి కదులుతూంది. పిల్లలు హుషారుగా 'టాటా' చెప్తున్నారు.

రాజారావు- విశ్వనాథం- వాళ్ళ భార్యలు-''వస్తాంబావగారూ, చాలా థాంక్స్.. వచ్చే ఏడు పండక్కి వీలుంటే వస్తాం... సరదాగా గడుపుదాం'' అన్నారు.

రైలు కూత వేస్తూ కదిలింది.

ముకుందరావు వచ్చే ఏడు పండగ గురించి ఆలోచిస్తూ నిలబడి పోయాడు. జానకి అతన్ని పట్టి కుదుపుతూ... ''బండి వెళ్ళిపోయింది. రండి... తర్వాత ఆలోచిద్దురు గానీ'' అంది.



వాస్తువ్యాసపరంపర

## వేధా దోషాలు

**ధర్మశాల వేధ:-** ధర్మశాలకు ఎదురుగుండానూ, రెండు ప్రక్కలా 200 గజాల దూరంలో ఇల్లు కట్టుకో కూడదు.

**శల్య వేధ:-** గృహము నందు కానీ, గృహావరణలో గానీ ఎముకలున్నా, ఎముకలు పాతి పెట్టబడినా ఈ దోషం సంక్రమిస్తుంది. ఈ దోషమున్న ఇల్లు దీర్ఘ వ్యాధుల్ని అపమృత్యువునీ కలుగ చేస్తుంది.

**కుల్య వేధ:-** ఇంటికి దక్షిణ దిక్కునందు గానీ, పడమర దిక్కున గానీ కాలువ ఉండడం మూలంగా ఏ వేధా దోషం కలుగుతుంది. దీని మూలంగా వ్యాధి బాధాలుంటాయి.

**తటాక వేధ:-** ఇంటికి దక్షిణ, ఆగ్నేయ, వాయవ్య భాగాలందు చెరువులు, కోనేరులు వుండడం మూలంగా ఈ వేధ దోషం తగులుతుంది. దీని మూలంగా గృహ యజమాని అష్ట కష్టాలు పడ్తారు.

**వారి ప్రవాహవేధ:-** ఇంటికి నైఋతి దిశ నుండి ఆగ్నేయ దిశకు గానీ, ఆగ్నేయము నుండి నైఋతికి కానీ, ఈశాన్యము నుండి ఆగ్నేయమునకు, నైఋతి దిశ నుంచి వాయవ్యమునకు, వాయువ్య నుండి నైఋతికి ప్రవహించుచున్న జల ప్రవాహము ఉండడం మూలంగా సంభవించే ఈ దోషం మూలంగా గృహంలో వుండే వాళ్ల వంశ నాశనాన్ని ఎదుర్కొంటారు.

**స్వజల వేధ:-** తన గృహమందలి నీరు దక్షిణ, ఆగ్నేయ, నైఋతి దిశలుగా ప్రవహించడం మూలంగా ఈ దోషం కలుగుతుంది. దీని మూలంగా కలతలు ఏర్పడ్తాయి.

**పరజల వేధ:-** ఇతరుల ఇంటి నీరు మన గృహావరణలోకి ప్రవహించ కూడదు. అలా జరిగినప్పుడు సంక్రమించే దోషం మూలంగా విరోధాలు ఏర్పడ్తాయి.

**పక్షి వేధ:-** ఇంట్లో పక్షులు, గబ్బిలాలు నివసించ కూడదు. అలా కాని పక్షంలో ఈ వేధా దోషము కలుగుతుంది.

—— ''హాదిల'' మైక్రోవేవ్ క్వార్టర్స్, వరంగల్